క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

ఆత్మకూర్: ప్రొహిబీషన్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆత్మకూర్‌లో సోమవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నామని సీఐ యమునాధర్ రావు తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలు వేలం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు నిర్ణీత రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

వనపర్తిటౌన్: పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు వనపర్తి ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అందిస్తోందని డిపో మేనేజర్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవా, షిర్డీ, తుల్జాపూర్, గానుగాపూర్, వైజాగ్, భద్రాచలం, వరంగల్, యాదగిరిగుట్ట తదితర పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు ఒకటి, రెండు, మూడు, ఐదురోజుల టూర్ ప్యాకేజీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ యాత్రలు ఈ నెల 27 నుంచి ప్రారంభమై రెగ్యులర్‌గా కనీస ప్రయాణికులు ఉంటే బస్సులు నడుపుతామని చెప్పారు. ఆసక్తి గల ప్రయాణికులు ఈ నెల 27న ప్రారంభమయ్యే యాత్రలకు 24వ తేదీలోగా టికెట్ బుక్ చేసుకోవాలి సూచించారు. భోజనం, ఇతర ఖర్చులు ప్రయాణికులే భరించుకోవాలన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్లు 99592 26289, 79957 01851 సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన దేవేందర్ కుటుంబ నివాసం ఉంటున్న పూరిగుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఈ నెల 4న దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, ఇంటి సామగ్రి, బియ్యం, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి స్థానిక కాంగ్రెస్ నాయకులు మేమున్నామంటూ బియ్యంతో పాటు నగదును అందజేశారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు ఆర్థికంగా ఆదుకునేందుకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సాయిబాబా, తోకలి రవి, మేడపల్లి రాములు, బ్రహ్మయ్య, రాజిరెడ్డి, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం: కేసునమోదు

ఖిల్లాఘనపురం: మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన శనివారం ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన కుర్వ పెద్ద శాంతయ్య తన పేరున పట్టా ఉన్న వ్యవసాయ పొలం (సర్వే నంబర్లు 198ఈ1, 198ఈ2) లోని 3 ఎకరాల 15 గుంటల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఈ పంటను ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన బాధితుడి కుమార్తె పూల చంద్రకళ, ఆమె భర్త పూల నవీన్, ఉప్పరిపల్లికి చెందిన పెద్ద కుర్వ రామకృష్ణ ఈ నెల 4న సాగు చేసిన మొక్కజొన్న పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశారు. పంటను విత్తుకోవడానికి ఖర్చు రూ.10,500 అయినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై శనివారం బాధితుడు పెద్ద కుర్వ శాంతన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో



పాన్‌గల్: అదుపుతప్పి ఆటో పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన శ్రీనునాయక్ కుటుంబం తండా నుంచి హైదరాబాద్‌కు ఆటోలో వెళ్తున్న క్రమంలో దావాజిపల్లి స్టేజీ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న ఐదుగురి కుటుంబ సభ్యుల్లో ఒక మహిళకు రక్త గాయాలయ్యాయి. ఆటో అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ చెట్టుకు తాకి ఆటో ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రురాలిని వెంటనే ప్రైవేట్ వాహనంలో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

నిలిచిన 'స్త్రీనిధి' చెల్లింపులు



జమ్మాపూర్‌లో సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీసీ నాగరాజు (ఫైల్)



పాన్‌గల్ మహిళా సమాఖ్య కార్యాలయం

- రూ. 2 కోట్లు పెండింగ్
- వసూళ్లపై దృష్టి సారించని అధికారులు

పాన్‌గల్: స్వయం సహాయక మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం బ్యాంకు అనుసంధానం ద్వారా స్త్రీ నిధి రుణాలు అందించింది. ఏటా కొంత లక్ష్యం నిర్దేశించుకొని ఆ మేరకు రుణాలు ఇస్తున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఓవర్ డ్యూ పేరుతో మండలంలోని చాలా గ్రామాల్లో స్త్రీ నిధి రుణాల పంపిణీ ఐదేళ్లుగా నిలిచిపోయింది. దీంతో రెగ్యులర్‌గా చెల్లించే సభ్యులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రుణాల వసూళ్లపై సమాఖ్య, బ్యాంక్ సిబ్బంది పట్టించుకోవడం లేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సభ్యుల పేర్లతో సిబ్బంది రుణాలు

మండలంలోని సమాఖ్య కార్యాలయంలో పనిచేసే కొంతమంది సిబ్బంది సభ్యుల పేరుతో స్త్రీ నిధి రుణాలు పొంది వాటిని సకాలంలో చెల్లించకపోవడంతో సభ్యుల పేర్ల మీద బకాయిలు చూపుతున్నాయి. అయినా ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేయకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సమాఖ్య సభ్యులు పేర్కొంటున్నారు.

మండల పరిస్థితి ఇలా..

మండలంలోని 28 పంచాయతీల్లో 2016 సంవత్సరం నుంచి 2020 వరకు స్త్రీ నిధి రుణాలు రూ.1.98 కోట్ల వరకు పెండింగ్ బకాయిలు ఉన్నాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఆయా జీపీల్లో దావాజిపల్లి, రాయినిపల్లి గ్రామాలు మినహా మిగతా అన్ని గ్రామాల్లో చెల్లింపులు పెండింగ్‌లో ఉండటంతో ఓవర్ డ్యూ పేరుతో స్త్రీ నిధి రుణాలు అందించడం నిలిపివేశారు.

మండలాల వారీగా..

మండలం	సంఘాలు	సభ్యులు	బకాయిలు
పాన్‌గల్	671	7233	రూ.1.98 కోట్లు
చిన్నంబావి	411	4045	రూ.60 లక్షలు
వీపనగండ్ల	441	4567	రూ.68 లక్షలు

పర్యవేక్షణ లేకనే..



స్త్రీ నిధి రుణాల పంపిణీ, వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ లేకనే బకాయిలు పెరిగిపోయాయి. రుణాలు అర్హులే తీసుకుంటున్నా రా.. సద్వినియోగం చేసుకుంటున్నారా అనే విషయాలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించడం లేదు. సభ్యుల పేరుతో రుణాలు పొందిన సిబ్బంది విషయంపై సమగ్ర విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. – కళావతమ్మ, సీపీఐ జిల్లా నాయకురాలు, కేతేపల్లి

సభ్యులకు ఇబ్బందులు



స్త్రీ నిధి రుణాలు తీసుకున్న సభ్యులు బకాయిలు పడటంతో సకాలంలో చెల్లించే సభ్యులకు కూడా ఇబ్బందు లు తప్పడంలేదు. ఓవర్ డ్యూ పేరుతో స్త్రీ ని ధి రుణాలను అందించడం లేదు. బకాయి లు పడ్డ గ్రామాల్లో అధికారులు పర్యటిస్తూ సభ్యులకు అవగాహన కల్పించాలి. – సుజాత, సంఘం సభ్యురాలు, బహదూర్‌గూడెం

నోటీసులు ఇచ్చాం



మండలంలోని పలు గ్రామాల్లో స్త్రీ నిధి రుణాలు బకాయిలు ఉన్నా మాట వాస్తవమే. రుణాలు చెల్లించని సభ్యులకు అవగాహన కల్పిస్తూ నోటీసులు అందజేశాం. మండలంలో చాలా గ్రామాలల్లో ఓవర్ డ్యూతో రుణాలు ఇవ్వడం లేదు. బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాతనే నూతన రుణాలు అందిస్తాం. సభ్యుల పేరుతో సిబ్బంది రుణాలు పొందిన విషయాన్ని రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం. – శివకుమార్, స్త్రీ నిధి మేనేజర్, పాన్‌గల్

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



గోప్లాపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను తిలకిస్తున్న భక్తులు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న సీతారాముల విగ్రహ, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బొడ్రాళ్ల పండుగ, సత్యానారాయణస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులకు చీరసారెలను పెట్టి తమ ఆచార సంప్రదాయాలను చాటుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణను గ్రామానికి చెందిన సురభి కిషన్‌రావు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామానికి చెందిన దాత సోమిశెట్టి కిశోర్‌కుమార్‌శెట్టి విగ్రహాలను ఇప్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, నందిమళ్ల అశోక్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, వీరసాగర్, లక్ష్మి, చిట్యాల రాము, శేషిపాణి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం కర్ణాటక రాష్ట్రం అవిష్పాడు గ్రామానికి చెందిన సెంట్రింగ్ రంగప్ప సరోజమ్మ దంపతులు నూతన మండపం అలివేలు మంగమ్మ విగ్రహం కోసం రూ.1,50,000 వేలు అందజేశారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం



వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం 14 రకాల వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను గణనీయంగా పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో శనివారం పెబ్బేరు మండల బీజేపీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పెబ్బేరు మండల కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో వారు రైతులతో కలిసి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గొని వేమారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు కావలి క్రాంతికుమార్, విష్ణువర్ధన్, నాగరాజు, నరసింహానాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్



మదనాపురంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



శ్రీరంగాపురంలో శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

సాక్షి, నెట్‌వర్క్: మహ్మద్ ప్రవక్త బోధించిన సూత్రాలు మానవళికి ఆచరణీయం అని మౌలానాలు తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా మస్జిద్‌ల నుంచి ముస్లింలు ఈద్గాహ్‌కు ర్యాలీగా వెళ్లారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని మౌలానాలు ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. పొటేళ్లను బలిచ్చి బంధువులు, స్నేహితులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మౌలానాలు ముక్తదీర్, ఆల్తాఫ్ బేగ్, ఎస్‌ఐ రాణి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ప్రసంగిస్తున్న మౌలానా అల్తాఫ్‌బేగ్



పెబ్బేరు పట్టణ కేంద్రంలో..



కల్వరాలలో..



గోపాల్‌పేటలో..



పాన్‌గల్‌లో..



ఆత్మకూర్‌లో ఈద్గాకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

'నకిలీ విత్తనాల నియంత్రణలో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

అమరచింత: నకిలీ విత్తనాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని, వానాకాలం వరి పంట కొనుగోళ్లు పూర్తయిన నేటికీ రైతు ఖాతాల్లో బోనస్ డబ్బులను జమ చేయలేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల రెండో మహాసభ నిర్వహించగా.. ఏఐకేఎస్ జెండా ఎగురవేశారు. సమావేశానికి చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసారి ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు వానాకాలం పంటలు సాగు ప్రారంభించారన్నారు. రైతులకు పెట్టుబడికి డబ్బులు అవసరమని, తక్షణం ప్రభుత్వం రైతు భరోసాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.7,500 ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేలకు కుదించడం సరికాదన్నారు. 2025 యాసంగిలో 53.4 లక్షల మంది రైతులకు సంబంధించి 72 లక్షల ఎకరాలకు రూ.4,366 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. వానాకాలానికి 70 లక్షల మంది రైతులకు రూ.7,320 కోట్లు రైతు భరోసా కింద చెల్లించాలని కోరారు. కూరగాయల విత్తనాలను రాష్ట్రం నుంచే ఎగుమతి చేస్తున్నా.. రాష్ట్రంలో 444 విత్తన కంపెనీలు, 467 సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నా వీటిని వ్యవసాయ శాఖ నియంత్రించలేకపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, మోహన్, మహేష్, మొగిలన్న, నాగరాజ్, శంకర్, అంజిరెడ్డి, రాజు, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం



మాట్లాడుతున్న మృతురాలి తల్లి సంతోష

కొత్తకోట రూరల్: దళిత కుటుంబానికి చెందిన బాలిక ఆత్మహత్య చేసుకుని 50రోజులు కావస్తున్నా పోలీసులు కారణమైన వ్యక్తిపై నేటికీ చర్యలు తీసుకోవడం లేదని, బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ గోవింద్ అన్నారు. వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన సంతోష, వెంకటయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. రెండో కుమార్తె పావని కొత్తకోటలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి పూర్తి చేసింది. పావని పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లికి తన అమ్మమ్మ ఇంటి వద్దకు వేసవి సెలవులకు వెళ్లింది. జగత్‌పల్లికి చెందిన రాఘవేందర్ అనే యువకుడు పావని ఫోన్‌కు అనేసార్లు కాల్ చేయగా చివరగా ఏప్రిల్ 17న అతడి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అదే రోజున పావని ఆత్మహత్య చేసుకుంది. పావని ఆత్మహత్యపై తమకు అనుమానం ఉందని పోలీసులకులో ఫిర్యాదు చేసినా నేటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి పెద్దమందడిలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో చైతన్యభారతి, సైదమ్మ, చెన్నకేశవులు, నీలమ్మ, చెన్నమ్మ, బుజ్జమ్మ, రామస్వామి, బాలస్వామి, కుర్మయ్య, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

మహాసభను జయప్రదం చేయండి





ఖానాపూర్‌లో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు, అమరచింతలో..

ఆత్మకూర్: టీయూసీఐ జిల్లా మహాసభలను ఈ నెల 11న అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహిస్తున్నామని, కార్మికులు వేలాదిగా తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, జిల్లా కోశాధికారి రాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మూలమళ్ల, ఖానపూర్ గ్రామాల్లో కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాన్ని టీయూసీఐలో విలీనం చేసిన అనంతరం జిల్లాల వారీగా సభలను నిర్వహిస్తున్నామని, కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజు, మనీష, పరిమళ, బాలమ్మ, తిరుపతమ్మ, ప్రేమ, కొండన్న పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో ఈనెల 11న జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు శనివారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా జిల్లా వ్యాప్తంగా కార్మికుల పక్షాన నిరంతరం పోరాడామన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్, మాస్‌లైన్ మండల కార్యదర్శి రాజన్న, సామేలు, భక్తరాజు, కురుమన్న, మస్తామని, ఆనంద్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కంచిరావుపల్లిలో రైతులకు అవగాహన చేస్తున్న శాస్త్రవేత్తలు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి, రాంపురం గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం, మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత డాక్టర్ అనిత, డాక్టర్ పద్మావతి పాల్గొని వానాకాలం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని, మార్కెట్‌లో డిమాండ్ మేరకు నూనె గింజలు, చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కురుమయ్య

వనపర్తిటౌన్: భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాలుగో మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి. కురుమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా నాలుగో మహాసభ జరుగుతుందని, ముఖ్య అతిథిగా తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, జిల్లా కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, రాబర్ట్, బాలరాజు, బాలస్వామి, రవి , వెంకటయ్య, మన్యం పాల్గొన్నారు

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతి రద్దుచేయాలి



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాజు

అయిజ: రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామం సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం అనుమతి రద్దు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా 12 గ్రామాల ప్రజలు ఏడాదికాలంపాటు పోరాటం చేస్తున్నారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మించరాదని చేపట్టిన నిరసన కార్యక్రమం హింసాత్మకం కావడానికి ప్రేరేపించిన వారెవరో జిల్లా ఎస్పీ గుర్తించాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజల పక్షాన ఉంటే ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యమెలా అవుతుందని అన్నారు. అమాయక రైతులు అరెస్ట్ కావడానికి, జైలుపాలు కావడానికి కారకులెవరని ప్రశ్నించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీని ఇతర ప్రాంతానికి తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ డేవిడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఏసన్న, బీఎస్పీ నాయకులు సుందర్‌రాజు, నరసింహులు పాల్గొన్నారు.